

కేశవ చూపు కేసీ వైపే..

ప్రాజెక్టు	రూ.కోట్లలో
శ్రీశైలం ప్రాజెక్టు	26.30
68 చిన్నచెరువులు	69.04
కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు	253.10
ఎస్సార్బీసీ	44.06
గాజులదిన్నె ప్రాజెక్టు	11.79
గురు రాఘవేంద్ర	69.04
శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం	2.23
సిద్దేశ్వరం ఎత్తిపోతల	6.29
ఎల్లెల్సీ, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులు	13.00
మొత్తం (రూ.కోట్లలో)	445.81

అంకెలు రూ.కోట్లలో

- ఉమ్మడి ప్రాజెక్టులకు రూ.445.81 కోట్ల కేటాయింపులు
- అత్యధికంగా కేసీ కెనాల్‌కు రూ.253.10 కోట్లు
- కర్నూలు జిల్లా ప్రాజెక్టులకు అరకొర నిధులే
- సూపర్ సిక్స్ పథకాలకు అధిక ప్రాధాన్యం
- పయ్యావుల బడ్జెట్‌లో పశ్చిమానికి అన్యాయం

కర్నూలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం 2024-25 బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. బాధ్యతలు చేపట్టిన తరువాత పూర్తి స్థాయి తొలి బడ్జెట్ ఇది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. నాలుగు నెలల బడ్జెట్ అయినా.. కరువుతో తల్లడిల్లే కర్నూలు ప్రాజెక్టులకు ఆశాజనకంగా కేటాయింపులు లేవు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా ప్రాజెక్టులకు రూ.445.81 కోట్లు కేటాయిస్తే అందులో సగానికి పైగా కేసీ కాలువకే కేటాయించారు. ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు నివారణ లక్ష్యంగా చేపట్టిన వేదవతి లిఫ్ట్, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులు సహా తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు అరకొర నిధులతో సరిపుచ్చారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు కాస్త ఊపిరి పోశారు. గుండ్రేవుల జలాశయం ఊసే లేదు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాల హామీలతో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆ పథకాలకు బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించారు. పేదల సంక్షేమ బడ్జెట్ ఇది అని విత్త మంత్రి పయ్యావుల చాటి చెప్పారు. జిల్లాలో విశ్వవిద్యాలయాలకు జీతాలు, నిర్వహణకు మాత్రమే నిధులు ఇచ్చారు. పయ్యావుల బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులపై ఆంధ్రజ్యోతి కథనం.







తుంగభద్ర నదిపై గుండ్రేవుల నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..

బడ్జెట్ వివరాలు 6లో

బడ్జెట్‌లో కీలకం!

హంద్రీ నీవాకు రూ.812 కోట్లు



హంద్రీ నీవా కాలువ వద్ద అసంపూర్తిగా వేదవతి ప్రాజెక్టు ప్రధాన పంపింగ్ కేంద్రం పనులు

హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోత పథకం ప్రాజెక్టు ఫేజ్-1, ఫేజ్-2 కింద కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలో లైనింగ్, అసంపూర్తి పనులు, పాత బిల్లుల చెల్లింపులు సహా వివిధ పనులు, జలాశయాల నిర్వహణ కోసం రూ.812 కోట్లు కేటాయించారు. మూడు జిల్లాలకు కలిపి కేటాయంపులు చేయడంతో ఏ జిల్లాకు ఎంత అన్నది స్పష్టత లేదు. పత్తికొండ రిజర్వాయర్ కుడి ఎడమ కాలువలు అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు దాదాపు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. వాటికి పరిపాలన అనుమతులు రాలేదు. అదే క్రమంలో హంద్రీనీవా విస్తరణ కోసం ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అంటే.. ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఫేజ్-2 కింద అనంతపురం, చిత్తూరు జిల్లాలో చేపట్టే పనులకే ఖర్చు చేసే అవకాశం ఉంది. హంద్రీనీవా ఎత్తిపోతల పథకాలకు దాదాపు రూ.3,500 కోట్ల విద్యుత్ చార్జీల బకాయి ఉంది. ఏడాదికి రూ.6-8 కోట్ల వడ్డీ అవుతుంది. విద్యుత్ బిల్లులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

కందనవోలుకు అరకొర నిధులే..

ఉమ్మడి కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు 2024-25 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.445.81 కోట్లు కేటాయించారు. అందులో నంద్యాల జిల్లాలో శ్రీశైలం ప్రాజెక్టు, కేసీ కాలువ, కుందూ విస్తరణ, ఎస్ఆర్‌బీసీ, సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకాలకు రూ.329.75 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించగా నిత్యం కరువు, వలసలతో తల్లడిల్లే కర్నూలు జిల్లాలో తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ (ఎల్లెల్సీ), గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్, వేదవతి, గాజులదిన్నె ప్రాజెక్టులకు రూ.115.39 కోట్లు మాత్రమే కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన నిధుల్లో అత్యధికంగా కేసీ కాలువకు రూ.253.10 కోట్లు ఇచ్చారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన కుందూ విస్తరణ పనులకు పాత బిల్లుల చెల్లింపులే అధికంగా ఉన్నాయని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. కర్నూలు జిల్లా ప్రాజెక్టులైన వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ఉంటే తక్షణం భూ సేకరణ చేపట్టి వేసవిలో పనులకు అంకురార్పణ చేసే అవకాశం ఉండేది. ఈ బడ్జెట్‌లో నిధులు ఊసే లేకపోవడంతో ఈ పనులకు మోక్షం లభిస్తుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ ఆపేశారు. బడ్జెట్‌లో రూ.11.79 కోట్లు ఇచ్చారు. కాంట్రాక్టరు బిల్లులు చెల్లించి పనులను మొదలు పెట్టాల్సిన బాధ్యత ఇంజనీర్లు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిలపై ఉంది. పత్తికొండ, డోన్ నియోజకవర్గాల్లో 68 చెరువులకు హంద్రీ నీవా కాలువ నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసే ప్రాజెక్టుకు రూ.20 కోట్లు కేటాయించారు. అసంపూర్తి పనులతోపాటు నిర్వహణ సిబ్బందిని నియమించుకునే అవకాశం ఉంది. గుండ్రేవుల జలాశయంపై బడ్జెట్‌లో ఊసే లేకపోవడం రైతులను నిరాశకు గురి చేసింది.

విదేశాలకు మన ఉల్లి

- ఇక్కడి నుంచి బంగ్లాదేశ్‌కు సరఫరా
- దేశంలోని ఆరు రాష్ట్రాలకు కూడా..
- ఆశించిన ధరతో రైతుల్లో ఆనందం



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో సాగు చేస్తున్న ఉల్లి విదేశాలకు ఎగుమవుతోంది. ఫలితంగా రైతులకు ఆశించిన ధర దక్కుతోంది. దశాబ్ద కాలంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఎమ్మిగనూరు, కోడుమూరు, డోన్, పాణ్యం, ఆలూరు, గోనెగండ్ల, కర్నూలు తదితర నియోజకవర్గాల నుంచి దాదాపు వేల టన్నుల ఉల్లి ఉత్పత్తి జరిగేది. ఈ సరుకునంతా కర్నూలు మార్కెట్ యార్డు నుంచి బంగ్లాదేశ్‌తోపాటు తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, కోల్‌కత్తా తదితర ఆరు రాష్ట్రాలకు వ్యాపారులు సప్లయ్ చేస్తున్నారు. ఐదు సంవత్సరాలుగా అతివృష్టి, అనావృష్టితో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉల్లి రైతులు తీవ్ర కష్ట నష్టాలను ఎదుర్కొన్నారు. ఈ సంవత్సరం సరిపడా వర్షాలు కురవడంతోపాటు తెగుళ్లు ఎక్కువగా వ్యాపించకపోవడంతో ఎకరాకు 60 నుంచి 100 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. మరోవైపు మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉల్లి పంట భారీ వర్షాలకు దెబ్బతినడంతో కర్నూలు మార్కెట్ యార్డు నుంచి పెద్దఎత్తున దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్వింటాకు మూడు వేల నుంచి రూ.4.50 వేల దాకా అందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉల్లికి గిరాకీ ఎక్కువగా ఉండటంతో రైతులు మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. ప్రతి రోజూ పది వేల క్వింటాళ్లకు పైగా కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు అమ్మకానికి తీసుకువస్తున్నారు.

మిగతా 6లో..

క్వింటం రూ.5 వేలకు చేరువలో ఉల్లి

రూ.4 వేలకు పైనే మధ్యస్థ ధర

కర్నూలు మార్కెట్ యార్డుకు సోమవారం పెద్ద ఎత్తున ఉల్లి విక్రయానికి వచ్చింది. 12,061 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. క్వింటానికి గరిష్ఠ ధర రూ.4,850, మధ్యస్థం రూ.4,019, కనిష్ఠం రూ.497కు అమ్ముడుపోయినట్లు ఆమె తెలిపారు. ఎండు మిరప కాయలు వారం దాకా రూ.10 వేలకు మించలేదు. సోమవారం గరిష్ఠం రూ.12,200, మధ్యస్థం రూ.10,199, కనిష్ఠం రూ.1,599 పలికింది. సజ్జలు గరిష్ఠం రూ.2,185, మధ్యస్థ రూ.2,031, కనిష్ఠ రూ.2,011గా నిర్ణయించినట్లు సెక్రటరీ తెలిపారు. వేరుశనగ కాయలు గరిష్ఠం రూ.6,269, మధ్యస్థం రూ.4,400, కనిష్ఠం రూ.2,777 వచ్చింది. పొద్దుతిరుగుడు విత్తనాలు గరిష్ఠంగా రూ.5,829, మధ్యస్థం రూ.5,689, కనిష్ఠం రూ.1,009 పలికాయి. మొక్కజొన్నలకు గరిష్ఠంగా రూ.2,249లు, మధ్యస్థంగా రూ.2,221, కనిష్ఠం రూ.1,891 రైతులకు దక్కింది. మినుములు గరిష్ఠం రూ.,8,200, మధ్యస్థంరూ.8,111లు, కనిష్ఠంగా రూ.2,100 పలికాయి. సోయాబీన్స్ గరిష్ఠ ధర రూ.4,191, మధ్యస్థ ధర, కనిష్ఠ ధర రూ.3,331 రైతులకు దక్కింది. కొర్రలకు గరిష్ఠ ధర రూ.3,209, మధ్యస్థ ధర రూ.2,616, కనిష్ఠ ధర రూ.1,849 దక్కిందని సెక్రటరీ జయలక్ష్మి, అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్వర్లు తెలిపారు.

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 86 ఫిర్యాదులు

7

యురేనియం తవ్వకాలు జరగనివ్వం

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన ఆయా గ్రామాల ప్రజలు
- తవ్వకాలు చేయబోమని స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్

6

అప్పులు తీర్చలేక అన్నదాత బలవన్మరణం

7

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

కలెక్టర్ పి. రంజిత్ బాషా



బాధితుడితో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో వచ్చే దరఖా స్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. డీఎస్‌డీవో, ఎయిడ్స్ నియంత్రణ అధికారి రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ పత్తికొండ లాగిన్‌లో ఏడు రోజుల కింద అర్జీలు వచ్చాయని తెలిపారు. వాటిని ఓపెన్ చేసి చూడలేదని, ప్రతిసారి గుర్తు చేయాలా అని అసహ నం వ్యక్తం చేశారు. రీఓపెన్ కేసులకు సంబంధించి 25 అర్జీలు వచ్చాయని అన్నారు. సర్వే శాఖకు సంబంధించి ఐదు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశి ంచారు. సీఎం గ్రీవెన్స్‌కు సంబంధించి 18 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెష ల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొ న్నారు.

విద్యుత్ శాఖలో బదిలీలు

కల్లూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ శాఖ డోన్, ఆదోని డివిజన్లకు ఈఈలను నియమిస్తూ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి కార్పొరేట్ ఆఫీసులో ఈఈగా పని చేస్తున్న ఎం. చిన్నరెడ్డప్పను డోన్‌కు బదిలీ చేశారు. అలాగే అనంతపురం డీపీఈ ఈఈగా పనిచేస్తున్న బి. హరిని ఆదోని ఆపరేషన్స్ ఈఈగా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఈఈలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు.

14 నుంచి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) 3.0 సర్వేలో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ 3.0 క్యాన్సర్ స్ర్కీనింగ్‌కు సంబంధించిన క్యాన్సర్‌ను నివారించవచ్చు అనే పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి రాష్ట్రంలో, జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ 3.0 సర్వే, చిల్డ్రన్ సర్వే చేస్తామని అన్నారు. సర్వే ద్వారా 18 సంవత్సరాలు పైబడిన వారందరినీ పరీక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ హేమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్లు భవనాల శాఖకు రూ.9.554 కోట్లు



బడ్జెట్‌లో రోడ్లు భవనాల రంగానికి రూ.9,554 కోట్లు కేటాయించడం హర్షణీయం. సంక్రాంతి పండుగ నాటికి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాం. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రోడ్లు, భవనాల శాఖకు నిధులు కేటాయించి సహకరించారు. రోడ్ల మరమ్మతులను సకాలంలో పూర్తి చేయడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

- బీసీ జనార్దన్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి

రోడ్లను బాగు చేసేలా..

నంద్యాల జిల్లాలో దాదాపు 3300 కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని డోన్ నియోజకవర్గానికి మినహా ప్రత్యేకించి గతంలో ఎక్కడా నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. దీంతో జిల్లాలోని రోడ్లు అధ్వాన స్థితిని దాటిపోయాయి. వీటి గుండా ప్రయాణించాలంటే ప్రయాణీకులకు, వాహనదారులకు చుక్కలు కనిపించేవి. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆర్‌అండ్‌బీకి అధికార పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా రూ.9554 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తే జిల్లాకు ఎక్కువ నిధులు వచ్చే అవకాశం ఉంది.

యాంత్రీకరణకు ఊతం

ప్రస్తుత వ్యవసాయ విధానంలో యంత్రాల సాయం లేకుండా అన్నదాతలు వ్యవసాయం సాగించే పరిస్థితి లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం రైతులకు యంత్రాలు, పనిముట్లను రాయితీపై అందించేందుకు నిధులు కేటాయించింది. ఇదే విధానాన్ని వైసీపీ గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెడుతున్నామంటూ ప్రగల్భాలు పలికి మొదటి మూడు, నాలుగేళ్లు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రవేశపెట్టిన పథక లబ్ధిని కూడా పూర్తిగా వైసీపీ నేతల అనుభవించారు. ట్రాక్టరు వంటి ముఖ్యమైన వాటిని వైసీపీ నేతలు ఇళ్లలోనే పెట్టుకుని సొంతానికి వాడుకున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాత పద్ధతులను అవలంభించకుండా పూర్తిగా రైతులకు ఉపయోగపడేలా యంత్రాలను రాయితీపై ఇచ్చి, అందరికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోనుంది.

ప్రాజెక్టుల వారిగా కేటాయింపులు రూ.కోట్లలో

ప్రాజెక్టులు	2022-23	2023-24	2024-25
ఎల్లెల్సీ, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులు	22.00	80.94	13.00
కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు	70.60	224.44	253.10
ఎస్ఆర్‌బీసీ	55.07	38.38	44.06
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	22.83	24.65	69.04
68 చెరువులు	10.50	56.50	20.00
గాజులదిన్నె ప్రాజెక్టు	10.35	19.00	11.79
శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం	6.00	5.34	2.23
సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం	5.22	5.52	6.29
శ్రీశైలం ప్రాజెక్టు	23.63	21,27	26.30
మొత్తం	226.20	476.04	445.81

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో మైనార్టీలకు రూ.4376కోట్లు కేటాయించారు. గతంలో మైనార్టీలకున్న పథకాలన్నింటినీ తిరిగి పునరుద్ధరించి అమలు చేయనున్నారు.

- మౌలానా ముస్తాక్ అహమ్మద్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

వర్సిటీ అభివృద్ధిని విస్మరించారు



జిల్లాలో మూడు విశ్వవిద్యాలయాలు ఉన్నా వాటి అభివృద్ధిని ఆర్థిక మంత్రి పయ్యావులు కేశవ్ విస్మరించారు. రాయలసీమ వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చులకు రూ.10.45 కోట్లు కేటాయించారు. దక్షిణ భారత దేశంలోనే తొలి క్లస్టర్ విశ్వవిద్యాలయానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అది కూడా జీతాలకు ఒక్కటే. జగన్నాథ గట్టుపై 54 ఎకరాల్లో నిర్మిస్తున్న క్లస్టర్ వర్సిటీ నూతన భవనానికి ఒక్క పైసా ఇవ్వలేదు. దీంతో నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోక తప్పని పరిస్థితి. గత ఏడాది బడ్జెట్‌లో రూ.39 కోట్లు కేటాయిస్తే తాజాగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జీరో పద్దు చూపించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం సిబ్బంది జీతాలకు రూ.2.80 కోట్లు కేటాయిస్తే భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు ఇచ్చారు. ఓర్వకల్లు వద్ద గత టీడీపీ ప్రభుత్వంలో 110 ఎకరాల్లో నిర్మాణం చేపడితే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా వేయలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ రావడంతో ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణం మొదలై వేగంగా పనులు చేపడతారని ఆశిస్తే అరకొర నిధులతో సరిపుచ్చారు. అయితే.. ఈ నిధులు నాలుగు నెలలకే అని.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టే 2025-26 బడ్జెట్‌లో సముచిత స్థానం దక్కుతుందని టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. స్టేట్ క్యాన్సర్ యూనిట్, కర్నూలు సర్వజన వైద్యశాల, బోధనాస్పత్రికి దాదాపుగా రూ.56 కోట్లు కేటాయించారని అధికారులు పేర్కొన్నారు.

వేదవతి, గుండ్రేవుల పట్ల నిర్లక్ష్యం



వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్టుల గురించి ప్రస్తావించకపోవడం దారుణం. జిల్లా ప్రజలను కూటమి ప్రభుత్వం మరోసారి మోసం చేసింది. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి.

- బి.గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

రాష్ట్ర బడ్జెట్‌లో యువతకు అన్యాయం



రాష్ట్ర బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం యువతకు తీవ్ర అన్యాయం చేసింది. గత ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడలో పూర్తిగా వైఫల్యం చెందింది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ ఆర్భాటంగా రూ.2 లక్షల కోట్లు ఉంటే అందులో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.322 కోట్లు కేటాయించడం సిగ్గుచేటు.

- నక్కీ లెనిన్‌బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించలేదు

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ పథకాలకు నిధుల కేటాయించలేదు. మద్యం, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం, ప్రజలపై పన్నులు వేయడం ద్వారా నిధులు సేకరించాలనే ప్రతిపాదనలు చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ3000 ఇస్తామనే హామీకి తగిన నిధులు బడ్జెట్‌లో కేటాయించలేదు. తల్లికి వందనం పథకానికి రూ 12,480 కోట్లు అవసరమైతే కేవలం రూ 5300 కోట్లు మాత్రమే కేటాయించారు.

-రమేష్ కుమార్, సీసీఎం జిల్లా కార్యదర్శి, నంద్యాల

ఎన్నికల హామీలపై స్పష్టతలేని బడ్జెట్



తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తుందో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన చేయకపోవడం బాధాకరం. దళితులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం చూస్తే ప్రభుత్వానికి వారి పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తోంది. నిరుద్యోగ భృతి ఇస్తామన్న వాగ్దానాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. గత ప్రభుత్వంపై విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

- డి.గౌస్ దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి



శిక్షణ పొందుతున్న మహిళలు

భవితకు భరోసా

- **నైపుణ్య శిక్షణ నిరుద్యోగ యువతకు వరం**
- **జాబ్‌మేళాలతో వందల మందికి ఉపాధి**

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్షరాస్యుల శాతానికి సమాంతరంగా నిరుద్యోగం వృద్ధి చెందుతోంది. డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన పట్టభద్రులు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 వేల మంది ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వారికి ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తోంది. ఇప్పటికే కొన్ని వేల మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ప్రయోజకులుగా తీర్చిదిద్దింది. వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా శిక్షణ తరగతులు నిర్వహించి, వారికి ప్రత్యేకమైన జాబ్‌మేళా ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యం

- 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ పేరుతో ప్రతి జిల్లాలో ఒక కార్యాలయం, నియోజకవర్గానికి ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో అవసరార్థుల అర్హత, ఆసక్తులే ప్రామాణికంగా కోర్సులను ప్రవేశపెట్టింది. అరకొర అక్షర జ్ఞానం ఉన్న వారికి సైతం ఇక్కడ తగిన కోర్సులతో శిక్షణ ఇవ్వటం గమనార్హం. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా వారికి మార్గనిర్దేశనం చేస్తోంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే 51 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా 601 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మరో 407 మంది కోర్సులో ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 13 జాబ్‌మేళాలు ఏర్పాటు చేయగా, 63 పేరెన్నికగన్న కంపెనీలు పాల్గొన్నాయి. 711 మంది యువతకు ఉపాధి లభించింది. 2019 నుంచి 2024 మధ్య వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో ఈ సంస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువు తీరటంతో ఈ సంస్థకు నూతనోత్సాహం వచ్చినట్లయింది.

పలు రకాల కోర్సుల్లో శిక్షణ

జిల్లాలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలను ఆధారంగా చేసుకుని మానవ వనరుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. అరకొర చదువులు చదివిన వారికి వారి ప్రతిభ ఆధారంగా మెలకువలు నేర్పి, వారు ఎన్నుకున్న రంగంలో శిక్షణనిచ్చి నిష్ణాతులను చేస్తున్నారు. ప్రధానంగా ఎన్ఏసీ (న్యాక్) సంస్థతో అనుసంధానం చేసుకుని ప్రత్యేకించి భవన నిర్మాణరంగంలో తర్ఫీదు ఇస్తున్నారు. బేల్దారి, పెయింటింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, సర్వేయర్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వటంతోపాటు ఉపాధి కల్పిస్తున్నారు. లేనిపక్షంలో విశ్వకర్మ యోజన పథకం ద్వారా వారికి వ్యక్తిగత రుణాలను మంజూరు చేయించి స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై చదివిన విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ ఇచ్చి వారి అర్హతకు అనుగుణంగా, స్థానికంగా, ఇతర రాష్ట్రాలు, పెద్ద నగరాల్లోని కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చేలా తయారు చేస్తున్నారు. మహిళలకు సైతం స్థానికంగానే పేరుగాంచిన షాపింగ్ మాల్, నగల దుకాణాల్లో గౌరవ వేతనం అందేలా తోడ్పాటును అందిస్తున్నారు. మహిళలు తమకు నచ్చిన, ప్రవేశం ఉన్న రంగాల్లో రాణించేలా మెలకువలు నేర్పించి ఇంటి వద్దనే ఉపాధి పొందేలా కుట్టు, అల్లికలు, బ్యూటీషియన్, వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. వీరికి అవసరమైతే ముద్ర రుణాల ద్వారా ఆర్థిక సహకారం ఇస్తూ వారి ఉన్నతికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నారు.

గౌరవంగా జీవిస్తున్నాను



ఉచిత శిక్షణే కదా అని ఖాళీ సమయంలో కాలక్షేపానికి కోర్సులో చేరాను. సరదాగా తీసుకున్న శిక్షణ నేడు కుటుంబ పోషణకు ఎంతో ఆధారంగా నిలుస్తోంది. కోర్సు అనంతరం అక్కడ ఇచ్చిన సర్టిఫికెట్లు ఉద్యోగానికి ఎంతో ఉపయోగం పడ్డాయి. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.30 వేల జీతంతో గౌరవంగా జీవిస్తున్నాను.

- చిన్నయ్య, సర్వేయర్, హిమాచల్ ప్రదేశ్

శిక్షణ ఎంతో తోడ్పడింది



చదివిన చదువుకు.. చేస్తున్న ఉద్యోగానికి ఎటువంటి సంబంధం లేదు. కేవలం సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్ శిక్షణ తీసుకోవటం వల్ల వినియోగదారులతో ఎలా మాట్లాడాలి, ప్రజా సంబంధాలు ఎలా నిర్వహించాలి అనే విషయాలపై అవగాహన, అనుభవం వచ్చింది. దీంతో మారుతీ కంపెనీలో ఉద్యోగ అవకాశం వచ్చింది. ప్రస్తుతం రూ.25 వేల వరకు జీతం వస్తోంది. వృత్తి అనుభవం అనేది భవిష్యత్తులో మరింత ఉపయోగపడనుంది. ఈ శిక్షణ నాకు ఎంతో తోడ్పడింది.

-శేషాద్రి, మారుతీ కంపెనీ, బెంగళూరు

నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం



నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే నైపుణ్యాభివృద్ధి సంస్థ. స్థానికంగా ప్రతిభకు ప్రోత్సాహం లేక సరైన శిక్షణ కరువై జీవన చక్రం తారుమారయ్యే పరిస్థితులు తలెత్తకుండా ఉండాలనే సదుద్దేశంతోనే టీడీపీ ప్రభుత్వం ఈ సంస్థను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇప్పటికే కొన్ని వందల మంది తమ జీవితాలకు రక్షణ లభించేలా ఉద్యోగభద్రత కల్పించుకున్నారు. చాలా వరకు ఈ సంస్థ నిరుద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నా సరైన అవగాహన లేక వారు ముందుకు రావటం లేదు. వారిని చైతన్యుల్ని చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. నిరుద్యోగులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- ఆనంద్ రాజ్‌కుమార్, డీఎస్‌డీవో

యురేనియం తవ్వకాలు జరగనివ్వం

- **కలెక్టరేట్‌కు తరలి వచ్చిన ప్రభావిత గ్రామాల ప్రజలు**
- **తవ్వకాలు చేయబోమని ప్రకటించాలి: నాయకుల డిమాండ్**



కర్నూలు న్యూసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలను జరగనివ్వబోమని దేవనకొండ మండల ప్రజలు తేల్చి చెప్పారు. మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలు చేసేందుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో కప్పట్రాళ్ల, కోటకొండ, నెల్లిబండ, గుండ్లకొండ, గుడిమరాళ్ల, చెలెల్ల చిలిమిలా, బేతపల్లి గ్రామాల ప్రజలు సోమవారం కలెక్టరేట్ ముందు ఆందోళనకు దిగారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ముందుగా సుందరయ్య కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. కలెక్టరేట్ ఎదుట కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. పచ్చని గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారని, యురేనియం తవ్వకాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు వద్దని, తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు నిర్మలమ్మ మాట్లాడుతూ 20 రోజుల నుంచి మండల ప్రజానీకం తీవ్ర ఆందోళనతో ఉద్వేగానికి గురవుతున్నారన్నారు. కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇస్తేనే అందరు వెళ్లిపోతారని అన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఎలాంటి తవ్వకాలు చేపట్టడం లేదన్నారు. ప్రజాభిప్రాయం మేరకే యురేనియం తవ్వకాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన గ్రామస్థులతో మాట్లాడుతున్న జేసీ నవ్య

- కప్పట్రాళ్ల చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక అండగా ఉంటుందని వేదిక కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి అన్నారు. ఐక్యవేదిక అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యురేనియం తవ్వకాలు నిలుపుదల చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని అన్నారు. యురేనియం తవ్వకాల వల్ల గాలి, నీరు, వాతావరణ పర్యావరణం పంటలు మొత్తం కలుషితమవుతుందని తెలిపారు. ప్రజల కోసం ప్రజాప్రతినిధులు వారి పదవులు త్యాగం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం, ఎస్‌డీపీఐ జిల్లా నాయకులు చాంద్‌బాషా, వకీల్ బాషా, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు భారీగా తరలి వచ్చిన యురేనియం ప్రభావిత గ్రామాల ప్రజలు



ర్యాలీగా వెళ్తున్న సీపీఐ నాయకులు

విదేశాలకు మన ఉల్లి

(5వ పేజీ తరువాయి)



గతంలో కర్నూలు మార్కెట్ యార్డుకు వ్యాపారుల ఒత్తిడి కారణంగా రైతులు ట్రాక్టర్లలో ఎటువంటి సంచుల్లో నింపకుండా అలాగే తెచ్చి కర్నూలు మార్కెట్‌యార్డులో ప్లాట్‌ఫారాలు, రోడ్లపై నిల్వ చేసేవారు. ఐదారు వేల క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వస్తేనే యార్డులో ఉన్న ప్లాట్‌ఫారాలు, రోడ్లు ఉల్లితో నిండిపోయేవి. యార్డులో తిరగడానికి కూడా ఇబ్బందులు తలెత్తేది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రస్తుత మార్కెట్ కమిటీ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి గతంలో ఇక్కడ పని చేసినప్పుడు సంచుల్లో ఉల్లిని తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థలాభావం కొరత తీరిపోయింది. అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎంత ఉల్లి వచ్చినా కొనుగోలు చేస్తాం



గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి కాకుండా పక్క జిల్లాలైన నంద్యాల, అనంతపురంతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా రైతులు ఐదారు వేల దాకా క్వింటాళ్ల ఉల్లిని తీసుకువచ్చేవారు. ఆ మొత్తం ఉల్లిని నిల్వ చేసేందుకు తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సంచుల్లో నింపిన ఉల్లిని కొనుగోలు చేసే పద్ధతిని అమలులోకి తీసుకురావడం వల్ల ప్రస్తుతం పది వేల క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌యార్డుకు రైతులు తెచ్చినా స్థలాభావం సమస్య ఎదురు కావడం లేదు. రైతులు పండించిన ఉల్లి పంటకు ప్రస్తుతం మంచి ధర లభిస్తోంది.

- జయలక్ష్మి, సెక్రటరీ

వ్యక్తికి జైలు

నంద్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి జైలు శిక్ష విధించినట్లు టూ టౌన్ సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. నంద్యాల పట్టణం విశ్వనగర్‌కు చెందిన షేక్ బసిరుల్ల అలియాస్ బషీర్ అనే వ్యక్తి పట్టణంలోని శ్రీరామ థియేటర్ వద్ద మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడుగురిపై రౌడీ షీట్స్ తెరిచేందుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.


మూర్ఛ వ్యాధితో బాలుడి మృతి

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మూర్ఛ వ్యాధితో ఓ బాలుడు మృతి చెందాడు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం శనగల గూడురుకు చెందిన హరి కుమార్ రెడ్డి, నాగజ్యోతి దంపతులు కుమారుడు చక్రధర్‌రెడ్డి(9)తో సోమవారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానాలు చేస్తున్న సమయంలో బాలుడు మూర్ఛ వ్యాధికి గురయ్యాడు. తల్లిదండ్రులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలవుతున్నదని కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తులు, కూరగాయలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 వేల ఎకరాల్లో రసాయనాలు లేకుండా పంటలు సాగవుతున్నాయని అన్నారు. 20 సెంట్ల విస్తీర్ణంలో చిన్న కమతాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు ఏటీఎంల ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, రైతు సాధికార సంస్థ డీపీఎం చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

న్యుమోనియాతో జాగ్రత్త



- ప్రమాదకరంగా మారుతున్న కేసులు
- బాధితుల్లో చిన్నారులే ఎక్కువ
- నేడు వరల్డ్ న్యుమోనియా డే



పెద్దాసుపత్రిలో పెరిగిన బాధితులు

సీజన్ మారడంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు న్యుమోనియా బాధితుల సంఖ్య పెరిగింది. ఆసుపత్రికి వచ్చే ఓపీ రోగుల్లో 10 శాతం బాధితులు ఉన్నారు. ఇక చిన్న పిల్లల విభాగంలో ప్రతి రోజు ఓపీకి 300 మంది పిల్లలు వస్తుండగా.. అందులో 100 మంది న్యుమోనియాతో బాధపడేవారు. ఉన్నారు. అడ్మిషన్లల్లో కూడా చిన్న పిల్లలు 30 శాతం మంది చేరడం వ్యాధి తీవ్రతకు అద్దం పడుతుంది. చిన్న పిల్లలకు నెలలోపు పిల్లలకు ఎస్ఐసీయూ వారు చిన్నపిల్లలకు పీఐసీయూ యూనిట్‌లో నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచి ఆక్సిజన్ అంఇస్తూ నెబులైజేషన్ పెట్టి చికిత్స అందిస్తున్నారు.

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియా ఒక తీవ్రమైన అంటువ్యాధి. ఇది దగ్గు, తుమ్ముల ద్వారా శ్వాసకోశ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. ఈ ప్రమాదకరమైన వ్యాధి పిల్లలకు ఎక్కువగా వస్తుంది. వాతావరణంలో మార్పులు, వాయు కాలుష్యం వల్ల సాధారణంగా సీజన్ మారేటప్పుడు, ఇమ్యూనిటీ శక్తి తక్కువగా ఉండే పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. డబ్ల్యుహెచ్‌వి నివేదిక ప్రకారం ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 8.30 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులు న్యుమోనియాతో మరణిస్తున్నారు. పెద్దలు, పిల్లలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం నవంబరు 12న వరల్డ్ న్యుమోనియా దినాన్ని నిర్వహిస్తున్నారు.

న్యుమోనియా నివారణకు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి శ్వాస గణనలు -న్యుమోనియాను దాన్ని ట్రాక్‌లో ఆపండి అనే నినాదాన్ని ఇచ్చింది. ప్రతి శ్వాస ప్రాముఖ్యతను తెలుసుకుని వ్యాధిని ముందుగా గుర్తించడం, చికిత్స చేయించుకోవడం చాలా ముఖ్యం.

న్యుమోనియాను ఎదుర్కోవాలంటే ముందు దాని లక్షణాలు అందరికీ తెలిసి ఉండాలి.

లక్షణాలు

- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- గుండె వేగంగా కొట్టుకోవడం
- జ్వరం, వణుకు, చెమటలు
- దగ్గు, ఆయాసం, కడపు ఉబ్బరం
- ఛాతి నొప్పి, తలనొప్పి, వాంతులు.

న్యుమోనియా చికిత్స

ఈ వ్యాధి కొన్నిసార్లు ప్రాణాంతకం కావచ్చు. అందుకు తొలిదశలోనే గుర్తించాలి. ఐదేళ్లలోపు వయస్సు ఉన్న పిల్లల్లో న్యుమోనియాను త్వరగా తెలుసుకోవాలి. ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే అప్రమత్తం కావాలి. బ్యాక్టీరియా వల్ల సోకే న్యుమోనియాకు యాంటి బయోటిక్స్ ద్వారా చికిత్స అందించవచ్చు. అయితే వ్యాధి తీవ్రమైతే హాస్పిటల్‌లో తప్పక చేర్చాలి. ఎక్కువ విశ్రాంతి తీసుకోవడం, నీరు ఎక్కువగా తాగడం, వంటి చర్యలతో న్యుమోనియా రోగులు త్వరగా కోలుకోవచ్చును.

కడుపులో కదలికలు

పిల్లల కడుపులో కదలికలను తల్లిదండ్రులు గమనిస్తుండాలని వైద్యులు సూచిస్తున్నారు. అప్పుడే పిల్లల శ్వాస ఎలా ఉందో తల్లిదండ్రులకు తెలుస్తుంది. జలుబు వల్ల కూడా శ్వాసలో తేడా రావొచ్చు. వ్యాక్సినేషన్ సాయంతో చిన్న పిల్లల్లో న్యుమోనియాను అడ్డుకోవచ్చు. న్యుమోకాకల్ సూక్ష్మ జీవుల నుంచి వచ్చే న్యుమోనియాను అడ్డుకునేందుకు న్యుమోకాకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. మరో వైపు ఫ్లూ వ్యాక్సిన్‌ను వేయిస్తే వ్యాధి ముప్పును అడ్డుకోవచ్చును.

న్యుమోనియాను త్వరగా గుర్తించాలి

న్యుమోనియా వ్యాధిని నాలుగు రోజులలోపే గుర్తించాలి. వెంటనే చికిత్స తీసుకోవాలి. అన్ని రకాల న్యుమోనియా ప్రాణాంతకం కాదు. అందుకే తొలి దశలోనే గుర్తించాలి. మూడు రోజుల నుంచి జ్వరం, దగ్గు, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

- డా.రఫిక్ అహ్మద్, చిన్న పిల్లల వైద్యనిపుణుడు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు.



ఇది శ్వాసకోశ వ్యాధి

న్యుమోనియా శ్వాసకోశ వ్యాధి. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తులు దెబ్బతిని శరీరంలోని ప్రధాన అవయవాలపై ప్రభావం చూపుతుంది. ప్రత్యేకించి చిన్న పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. **- డా.ఆర్. మురార్జీ, చిన్న పిల్లల వైద్యనిపుణుడు, కర్నూలు మెడికవర్ హాస్పిటల్**



30 శాతం మంది న్యుమోనియా బాధితులు



చిన్న పిల్లల విభాగానికి వచ్చే రోగుల్లో 30 శాతం న్యుమోనియాతో బాధపడుతుంటారు. అడ్మిషన్లలో 20 మందిలో 8 నుంచి 10 మంది చిన్న పిల్లలు చేరుతుంటారు. చలికాలంలో, సీజన్ మారేటప్పుడు చిన్నపిల్లల్లో ఈ కేసులు అధికమవుతుంటాయి. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఆయాసం వస్తే దాని తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే హాస్పిటల్‌లో చేర్పించాలి. కర్నూలు జీజీహెచ్‌లో న్యుమోనియా వ్యాధికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉంది. ఆక్సిజన్, నెబులైజర్ యాంటీబయోటిక్ మందులు వెంటిలేటర్ సౌకర్యాలు ఉన్నాయి. **- డా.బంగి విజయానందబాబు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, చిన్న పిల్లల విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి**

వారోత్సవాలను విజయవంతం చేద్దాం



గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా పౌర గ్రంథాలయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామని అన్నారు. బాలల దినోత్సవం రోజు నవంబరు 14న జాతీయ పతాక ఆవిష్కరణ, ర్యాలీ, 15న వ్యాసరచన పోటీలు, పుస్తక ప్రదర్శన, పురాతన నాణ్యాల ప్రదర్శన, 16న చిత్రలేఖన పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న ప్లాస్టిక్ ప్రయోజనాలు, నష్టాల గురించి వక్తృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సంరక్షణ, నృత్య ప్రదర్శన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనంతో వారోత్సవాలను ముగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, సీనియర్ అసిస్టెంట్ మక్బూల్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

గోనెగండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముగోడు గ్రామం దగ్గర సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్(28) అనే వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వేముగోడు గ్రామానికి చెందిన మహేష్, సుగ్నానం ఇద్దరు తమ ద్విచక్ర వాహనంలో వేముగోడు నుంచి కోడుమూరుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని పొద్దుపోయాక ద్విచక్ర వాహనంలో వేముగోడుకు బయలుదేరారు. గ్రామ శివారులోకి రాగానే ఎమ్మిగనూరు వైపు నుంచి కోడుమూరుకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి మహేష్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మహేష్, సుగ్నానంలు ఎగిరి రోడ్డుపై పడ్డారు. మహేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుగ్నానంకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని ప్రజలు అక్కడకు చేరుకొని 108 వాహనం ద్వారా సుగ్నానం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగధర్ తెలిపారు.



మహేష్ (ఫైల్)

‘ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిస్తాం’



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిస్తామని నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి 85 ఫిర్యాదులను స్వీకరించారు. అందినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

- 20 బైక్‌ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్డీపీఓ ఎస్.యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో నంద్యాల వన్‌టౌన్ సీఐ జి.సుధాకర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, సిబ్బంది మోటార్‌సైకిళ్ల దొంగను అరెస్ట్ చేశారు. సోమవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహానంది మండలం బసవాపురానికి చెందిన కాలే వెంకటరమణ నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. ఇప్పటివరకు నంద్యాల పట్టణం, ప్రకాశం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డాడన్నారు. నిందితుడు సోమవారం నంద్యాల చెరువుకట్ట టి జంక్షన్ సమీపంలో తచ్చాడుతుండగా అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుండి సుమారు రూ.15లక్షల విలువచేసే 20మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పెద్దాసుపత్రికి ఇద్దరు కొత్త డిప్యూటీ సూపరింటెండెంట్లు



ఉత్తర్వులు అందుకుంటున్న డా.సీతారామయ్య

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిపాలన సౌలభ్యం కోసం ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లను నియమిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం యురాలజీ సీనియర్ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డా.కే. సీతారామయ్య, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.డి. శ్రీరాములకు ఆసుపత్రి సూపరింటెండెంట్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు.

రైతు ఆత్మహత్య



మనోహర్ (ఫైల్)

వెల్దుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పులపాలైన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సర్పరాజపురంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన గుడిసె మనోహర్(38) తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా పంటలు సరిగ్గా పండకపోవడం, అరకొరగా పండిన పంటలకు గిట్టుబాటు ధరలేకపోవడంతో అప్పులపాలయ్యాడు. సుమారుగా రూ.10 లక్షల మేర అప్పులు కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. దీంతో ఆదివారం అర్ధరాత్రి తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న మనోహర్‌ను కుటుంబసభ్యులు ఆటోలో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 86 ఫిర్యాదులు

- విచారణ జరిపి న్యాయం చేస్తాం
- ఎస్పీ జి. బిందు మాధవ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 86 ఫిర్యాదులు వచ్చాయి.

- గూడూరుకు చెందిన సుభాకర్ ఎమ్మిగనూరులో యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.6లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలుకు చెందిన శ్వేతారెడ్డి ఫిర్యాదు చేశారు.
- పొట్లపాడు గ్రామానికి చెందిన నాగరాజు ఏపీ మోడల్ స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన అన్వేష్ ఫిర్యాదు చేశారు.
- పొలం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పి మహేష్ రూ.2.65 లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం పల్లెదొడ్డి గ్రామానికి చెందిన భీమలింగడు ఫిర్యాదు చేశారు.
- తన బిడ్డ పద్మావతిని అల్లుడు శేఖర్ తీవ్రంగా గాయపరిచాడని, న్యాయం చేయాలని వెల్దుర్తి మండలం బాగోలి గ్రామానికి చెందిన సోమేష్ ఫిర్యాదు చేశారు.
- ప్లాట్ కొనడానికి రూ.50 లక్షలు కట్టామని, అయితే ప్లాట్ రిజిస్ట్రేషన్ కాదని చెప్పాదని, తిరిగి డబ్బు ఇవ్వకుండా కర్నూలుకు చెందిన వసంతకుమారి బెదిరిస్తున్నదని కర్నూలు గురు రాఘవేంద్రనగర్‌కు చెందిన రామ్మోహన్ ఫిర్యాదు చేశారు.
- తన ప్రమేయం, సంతకం లేకుండానే తన బావ ప్రసాద్, క్రెడిట్ కార్డు లోన్ రూ.5 లక్షలు, బిజినెస్ లోన్ రూ.1లక్ష తీసుకుని తిరిగి కట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వెల్దుర్తికి చెందిన రాజేష్ ఫిర్యాదు చేశారు.
- ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి జాయ్ హోమ్స్‌కు చెందిన చంద్రకంటి రామకృష్ణ అలియాస్ కిషన్ డబ్బులు తీసుకుని ఇబ్బందిపెడుతున్నాడని కర్నూలు గణేష్ నగర్‌కు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులన్నింటినీ పరిష్కరిస్తానని ఎస్పీ జి. బిందుమాధవ్ హామీ ఇచ్చారు.

141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలవుతున్నదని కలెక్టర్ పి. రంజిత్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తులు, కూరగాయలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, రైతు సాధికార సంస్థ డీపీఎం చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మల్లికార్జున పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ బి. నవ్య ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ, మైనార్టీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్, ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, మైనార్టీ సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: బీ. క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.వెంకటేశ్వర్లు, సీనియర్ అధ్యాపకుడు మల్లికార్జున పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, నికిలేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు టి. మద్దిలేటి, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, ఎ.వెంకట సుజాత, తిప్పనాయుడు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను రూపొందించుకోవాలి

ఉర్దూ వర్సిటీ మాజీ ఉపకులపతి

కర్నూలు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాప్రమాణాలు రూపొందించుకోవాలని మాజీ ఉపకులపతి వై. నరసింహులు అన్నారు. సోమవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయింంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం అజాద్ చేపట్టిన సంస్కరణల ఫలితంగా ప్రపంచంలో ఎక్కడ లేని మానవ వనరులు మన దేశంలో అభివృద్ధి చెందాయని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్ షావలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లోక్‌నాథ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మహిళను కాపాడిన వ్యక్తికి ఎస్పీ అభినందన

కర్నూలు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లో దూకి ఓ మహిళను కాపాడిన ఎం.రాజేష్ అనే వ్యక్తిని ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సీపీఎం కొట్టాలకు చెందిన ఎం.రాజేష్‌ను ఎస్పీతో పాటు వన్‌టౌన్ సీఐ రామయ్య నాయుడు, వన్‌టౌన్ కానిస్టేబుల్ కాశీం యాదవ్ శాలువాతో సన్మానించారు. కల్లూరు ఎస్టేట్‌కు చెందిన జంగం నిర్మలమ్మ (50) కుటుంబ సమస్యలతో కేసీ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేసీలో ఆమె కొట్టుకుపోతుండగా.. గమనించిన సీపీఎం కొట్టాలకు చెందిన ఎం.రాజేష్ కేసీలో దూకి నిర్మలమ్మను కాపాడి ఒడ్డుకు చేర్చాడు. నిర్మలమ్మను కానిస్టేబుల్ కాశీం యాదవ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం చేయించారు.

'మాంసం దుకాణాన్ని తొలగించాలి'

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన మాంసం దుకాణాన్ని తొలగించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్థానికులు బి.విజయ్ కుమార్, వీరేంద్రకుమార్ ఫిర్యాదు చేశారు. సోమవారం నగర పాలక కార్యాయ లంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 18 ఫిర్యాదులు వచ్చాయి. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ ప్రజా సంబంధాల అధికారిగా(పీఆర్‌ఓ) సూపరింటెండెంట్ రమేష్‌బాబును నియమించారు. ఈ మేరకు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం ఇక్కడే పీఆర్‌ఓగా పని చేసిన ఆయన ఆళ్లగడ్డ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీల్లో తిరిగి నగర పాలక సంస్థకు వచ్చారు.

'పెట్టుబడి సాయం అందించాలి'

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి యేటా రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయాన్ని అందించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు రైతులతో వారు కలిసి ధర్నా చేశారు. ఈ కార్యక్రమం బి.సురేంద్ర యాదవ్ అధ్యక్షతన జరిగింది. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రబియా, హేమంత్ కుమార్, రామదాసు, కురు కుంద, మధు పాల్గొన్నారు.

త్రీటౌన్ సీఐగా శేషయ్య

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు త్రీటౌన్ సీఐగా శేషయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అదనపు పోస్టులో నియమితులైన ఈయనను త్రీటౌన్‌కు బదిలీ చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఈయనది సొంత జిల్లా కడప. చిత్తూరులో ఎస్ఐగా మొదటి పోస్టింగ్‌లో బాధ్యతలు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోడుమూరు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం శివారులోని హంద్రీనీవా కెనాల్ వద్ద సోమవారం పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేఎంసీ వైద్య విద్యార్థికి నివాళి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైద్య విద్యార్థి ప్రవీణ్ కుమార్‌కు సోమవారం సాయంత్రం కర్నూలు మెడికల్ కాలేజీ పరిపాలన విభాగం ఎదుట విద్యార్థులు, అధికారులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ మాట్లాడుతూ రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్ర త్తలు తీసుకోవాలని సూచించారు. జూడాల సంఘం అధ్య క్షుడు డాక్టర్ అచ్యుత్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిభావం అలవర్చుకోవాలి

ఓర్వకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని భారతీయ ధర్మపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకృష్ణ శరణానంద భారతి స్వామిజీ అన్నారు. సోమవారం మండలంలోని కాల్వబుగ్గ సమీపాన వెలసిన పూర్ణానంద ప్రబోధ ఆశ్రమం వద్ద సమావేశం నిర్వహించారు. పూర్ణానంద ప్రబోధ ఆశ్రమం వద్ద శ్రీమత పూర్ణానందగిరి ఆశ్రమ పీఠాధిపతికి పట్టాభిషేకం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, ఎన్నికల పరిశీలకుడిగా సురేష్ కుమార్ వ్యవహరించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎస్. దావీద్, జిల్లా అధ్యక్షుడిగా యు.ఆర్. రవికుమార్, జిల్లా ప్రధాన కార్యద ర్శిగా బి.నవీన్ పాటిల్, జిల్లా సహాధ్యక్షులుగా జి.హేమంత్ కుమార్, వి.వీవిత, ఆర్థిక కార్యదర్శిగా కే.యోహావా, జిల్లా కార్యదర్శులుగా తిమ్మన్న, ఎస్.ఇబ్రహీం, జి.భాస్కర్, గాదలింగప్ప, జి.వెంకటేష్, లక్ష్మీదేవిలను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యేను అభినందించిన బాలకృష్ణ



బాలకృష్ణతో ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని సినీ కథా నాయకుడు, హిందూపూర్ శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణ అభినందించారు. అమరావతిలోని ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సోమవారం దస్తగిరి బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలుసుకొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలకృష్ణ చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన దస్తగిరిని అభినందించారు.

సూపరింటెండెంట్లకు విభాగాల కేటాయింపు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్లకు విభాగాలను కేటాయిస్తూ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యుపీఏ విభాగంలో పని చేస్తున్న మన్సూర్‌బాషాను రెవెన్యూ విభాగానికి, రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న క్రిస్టఫర్‌ను యూపీఏ విభాగానికి, సీనియర్ అసిస్టెంట్ నుంచి ఇటీవల సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన టి.అబ్దుల్‌వాజిద్‌కు రెవెన్యూ విభాగం, సీనియర్ అసిస్టెంట్ నుంచి ఇటీవల సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన కే.రామక్రిష్ణకు పరిపాలన విభాగం, ఇక్కడ పని చేస్తున్న స్వర్ణలతను పబ్లిక్ హెల్త్ విభాగానికి, కేఎల్ఎన్.రెడ్డికి అర్బన్ రీసర్వే విభాగం, ఏవీరమేష్‌బాబుకు సెక్రటరీ సెక్షన్‌తోపాటు పీఆర్‌ఓ, జూనియర్ అసి స్టెంట్ జి.సుహేల్ అహ్మద్‌కు టి.అబ్దుల్ వాజిద్ సీటు కేటాయించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన పెండింగ్ క్లెయిమ్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నల్లన్న, బి.వెంకటేష్, చంద్రశే ఖర్ పాల్గొన్నారు.

15న వినాయక ఘాట్‌లో కార్తీక దీపోత్సవం

కర్నూలు(కల్చరల్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక ఘాట్‌లో ఈనెల 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కార్తీక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దీపోత్సవ సమితి కార్యాధ్యక్షురాలు ఇ. పద్మావతి, కార్యదర్శులు కే స్వప్నసారధి, మహాలక్ష్మి, జయలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమీపంలోని సాలమ్మ సత్రంలో విలేకర్ల సమావేశం వారు దీపోత్సవ వివరాలు తెలిపే కరపత్రాలు విడుదల చేశారు. రజనీ కల్యాకర, జే రాధిక, జి.వరలక్ష్మి, మల్లికార్జునరెడ్డి, కల్కి మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

గూడూరు నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరిం చాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు లోని తహసీల్దార్ కార్యాయలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి 8 ఆర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

స్టాంపు పేపర్ల దందా..!

- అధిక వసూళ్లకు పాల్పడుతున్న స్టాంప్ వెండర్లు
- పట్టించుకోని అధికారులు


బంకులో నుంచే స్టాంప్ పేపర్ల విక్రయాలు

ఆదోని, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వినియోగదారుల నుంచి అక్రమ వసూళ్లు యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూమి క్రయ విక్రయాలకు స్టాంపు పేపర్లు కొనాలంటే అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తోందని క్రయ విక్రయాలు చేసేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయంలో కౌంటర్ లేదు..

స్టాంపు పేపర్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలంలో అందుబాటులో ఉంచాలి. అయితే కార్యాలయంలో కౌంటర్ లేదు. బయట స్టాంపు వెండర్ల నుంచి కొనుగోలు చేయాల్సిందే. సిబ్బంది మొత్తం స్టాంపు పేపర్లను స్టాంపు వెండర్లకే ఇచ్చేస్తున్నట్లు సమాచారం.

స్టాంపు వెండర్ల వసూళ్ల దందా..

స్టాంపు వెండర్లు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ప్రశ్నించిన వారికి స్టాంపు పేపర్లను విక్రయించడం లేదు. రూ.20స్టాంపు పేపరుకు రూ.50లు, రూ.100 పేపర్‌ను రూ.150కు విక్రయిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే స్టాంపు పేపర్ల కొరత ఉందని సమాధానం చెబుతున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు..

కొందరు సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన సోమవారం పరిశీలించారు. ఈ అక్రమ వసూళ్ల దందాపై పలువురు వినియోగదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వారు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు కూడా ఇందులో భాగముందని ఆరోపణలు ఉన్నాయి.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం



స్టాంపు వెండర్లు అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంప్ పేపర్ల కొరత ఉంది. జిల్లా అధికారుల సూచనల మేరకు స్టాంపు పేపర్లను అన్నీ వెండర్లకే ఇచ్చేశాం. ఓ బాధితుడు రూ.100 స్టాంప్ పేపర్‌ను రూ.150లకు విక్రయించినట్లు ఫిర్యాదు చేశాడు. లిఖితపూర్వకంగా రాసి ఇవ్వలేదు. అయినా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. **- హాజేమియ్య సబ్ రిజిస్ట్రార్, ఆదోని**

పెట్టుబడిసాయం జమ చేయాలి

- రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీఆర్ భవన్ నుంచి రైతులతో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అన్నదాత సుఖీభవ హామీని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైనా రూ.20 వేలు ఇవ్వడానికి జాప్యం సరికాదన్నారు. రాయలసీమలో కరువు ఉందని, కోస్తాలో భారీ వరదలు ముంచెత్తి రైతులకు అపారనష్టం సంభవించిందన్నారు. రాజాసాహెబ్, సురేంద్ర కుమార్, వీరన్న, రామాంజనేయులు, సుల్తాన్, సుంకన్న, నెట్టికంటయ్య, వీరేష్, శంకర్ పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కండి

హాలహర్వి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని తహసీల్దార్ నజీమ భాను ఆదేశించారు. సోమవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. చింతకుంట, కామినహాల్ చెరువులతోపాటు హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ డిస్ట్రిబ్యూటర్ ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఓటరు జాబితా సిద్ధం చేసి ప్రచురించాలని తెలిపారు.

పంటల బీమా అమలు చేయాలి

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పంటల బీమాను అమలు చేయాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి మదనంతపురం హనుమన్న, వ్యకాసం అధ్యక్షుడు కోదండరాముడు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అధిక వర్షాలతో ఖరీఫ్‌లో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం కింద బీమా ఇవ్వాలని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అనంతరం వినతి పత్రం తహసీల్దార్ హుసేన్ సాహెబ్ అందజేశారు. నాయకులు నాగిరెడ్డి, బొజ్జన్న పాల్గొన్నారు.

హెచ్‌ఎంలపై ఒత్తిడి తగ్గించాలి



మాట్లాడుతున్న ఎస్టీటీయూ రాష్ట్ర కౌన్సిలర్ బీ మహదేవప్ప

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆపార్ ఐడీ నమోదులో ఎచ్‌ఎంలపై ఒత్తిడి తగ్గించాలని ఎస్టీయూ సభ్యుడు మహదేవప్ప డిమాండ్ చేశారు. సోమవారం ప్రాంతీయ కార్యాలయంలో చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అపార్ నమోదులో సాంకేతిక సమస్యలతో ఎక్కువ ఐడీలు చేయలేకపోతున్నారని అన్నారు. పీఆర్సీ ప్రకటించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా కార్యదర్శి బీ గోపాల్, నాయకులు సుధాకర్ బాబు, షేక్షావలి, ఆంజనేయ, గణేష్, రామ్మోహన్ రెడ్డి, వేణుగోపాలరావు, రంగన్న గౌడ్, రాజేష్, మౌలాలి పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పంపిణీ

ఆదోని టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రచురించిన భగవద్గీత పుస్తకాలను వీహెచ్‌పీ నాయకులు జిహ్వేశ్వర పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భీమిరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్ పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం ఇవ్వాలి

దేవనకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలను ఇవ్వాలని, హామీ నెరవేర్చాలని ఏపీ రైతుసంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ లోకేశ్వరయ్యకు వినతిపత్రం ఇచ్చారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అధికారులు గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామానికి చెందిన కురువ బసప్ప చిన్నమర్రి వీడు గ్రామ సర్వేనెంబర్ 286 ఎల్‌పీ నెంబర్ 1898కొంత భూమి ఉండగా ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు ఉందని మార్చాలని అర్జీ సమర్పించుకున్నారు.
2. గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామంలో ఎస్సీల శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అర్జీ సమర్పించుకున్నారు.
3. ఆదోని మండలానికి దివ్యాంగుల భవన ఏర్పాటుకు ఐదు సెంట్ల ప్రభుత్వ భూమి కేటాయించాలని విజేత దివ్యాంగులు అర్జీ సమర్పించు కున్నారు.
4. గ్రంథాలయం పరిసరాల్లో అపరిశుభ్రత, దుర్వాసనతో పాఠకులకు ఇబ్బందిగా ఉందని, పారిశుధ్య పనులు చేయించాలని పాఠకులు అర్జీ ఇచ్చారు. సర్వేయర్లు శ్రీనివాస రాజు, వేణు సూర్యడీఎల్‌డీపీవో, నూర్జహాన్, డీఎల్‌డీవో ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, హౌసింగ్ డీఇ రవి కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కష్టపడితే భవిష్యత్తు

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేస్తే పార్టీలో భవిష్యత్తు ఉంటుందని జనసేన జిల్లా నాయకుడు వైక్రాంతి కుమార్ అన్నారు. సోమవారం రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొజ్జమ్మను సన్మానించారు. బొజ్జమ్మ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. కప్పట్రాళ్ల కుటుంబీకులు ఎన్నో ఏళ్లుగా టీడీపీని అంటపెట్టుకుని పని చేయడంతో అధినాయకత్వం గుర్తించి పదవి ఇచ్చిందన్నారు. వాల్మీకులకు న్యాయం జరుగుతుందని అన్నారు.


బొజ్జమ్మను కలిసిన జనసేన నాయకుడు

జియో మైసూరు ప్లాంటు తనిఖీ


జియో ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో

తుగ్గలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జియో మైసూరు కంపెనీ, రైల్వే డబ్లింగ్ పనులను పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ తనిఖీ చేశారు. సోమవారం జొన్నగిరి, పగిడిరాయి గ్రామాల మధ్య ఉన్న ప్లాంటును పరిశీలించి కంపెనీ డైరెక్టర్ మానస్ రంజన్ బిశ్వాల్, పీఆర్వో రామ్మోహన్ రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెండేకల్, రామలింగాయపల్లె గ్రామాల మధ్య చేస్తున్న డబ్లింగ్ రైల్వే పనులను పరిశీలించారు. తహసీల్దార్ రమాదేవి, సర్వేయర్ సుధాకర్, వీఆర్వో కాశీ రంగస్వామి, తదితరులు ఉన్నారు.


ఎస్వీ సుబ్బారెడ్డి సమక్షంలో కేక్ కట్ చేస్తున్న నాగరత్నమ్మ

నాగరత్నమ్మ జన్మదిన వేడుకలు

పత్తికొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ 67వ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. స్వగృహంలో మాజీ మంత్రి, నాగరత్నమ్మ తండ్రి ఎస్వీ సుబ్బారెడ్డి, ఆమె భర్త కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అభిమానులు గజమాలతో సన్మానించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు డా.కల్పన, రాజేష్ ఆధ్వర్యంలో 30మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. సర్పంచ్ కొమ్ము దీపిక, వైస్ సర్పంచ్ పల్లె కళావతి, మాజీ సర్పంచ్ సోమశేఖర్, ఎంపీటీసీ నీలకంఠ, మాజీ వైస్ ఎంపీపీ పల్లెప్రతాప్ రెడ్డి, వార్డుమెంబర్లు కాళహస్తి సుంకన్న, లింగన్న, పాల్‌బాషా, కొమ్ము నెట్టికల్లు, శ్రీకాంత్ రెడ్డి, బాలిరెడ్డి, టైలర్ రంగన్న, పందికోన మల్లికార్జున పాల్గొన్నారు.

కొళాయి పనులకు భూమి పూజ

పత్తికొండ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందికోన గ్రామంలో సోమవారం ఇంటింటికి కొళాయి పనులకు సర్పంచ్ మంజుల భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే శ్యాంబాబు ఇచ్చిన హామీ మేరకు ట్యాంకు, ఇంటింటికి కొళాయి ఏర్పాటుకు జలజీవన్ మిషన్ కింద రూ.1.20 కోట్లు మంజూరు చేయించారన్నారు. కార్యదర్శి రామక్రిష్ణ నాయుడు కడవల నసుధాకర్, చెన్నంనాయుడు, రంగపురాజు ఉన్నారు.


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మంజుల

సరైన తూకంతో సరుకులు ఇవ్వాలి

తుగ్గలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు సరైన తూకంతో సరుకులు ఇవ్వాలని నాయకులు చంద్రశేఖర్ యాదవ్, సుంకన్న, రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రమాదేవిని సన్మానించి, విన్నవించారు. స్టాక్ పాయింట్ నుంచి వచ్చే సరుకులు సరైన తూకాలతో ఇస్తే మాకు నష్టం జరగదన్నారు. డీలర్లు నాయక్, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.


తహసీల్దార్ రమాదేవిని సన్మానిస్తున్న డీలర్లు

సభ్యత్వంతో భరోసా

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో కుటుంబానికి భరోసా ఉంటుందని మాజీ ఎంపీటీసీలు సుధాకర్ చౌదరి, శివశంకర్, మైనార్టీ నాయకులు సాయినగర్ బాషా అన్నారు. సోమవారం ఎం.అగ్రహారంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

అడంగల్‌లో అలాగే ఉంచాలి

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో భూములు తగ్గించేశారని, గతంలో అడంగల్‌లో ఎలా ఉంటే అలానే ఉంచాలని రైతులు కోరారు. సోమవారం రీసర్వే గ్రామాలైన హంప, బసినేపల్లి, బురుజుల గ్రామాల్లో ల్యాండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దేవేంద్రయ్య స్వామి, రీసర్వే డీటీ యువరాజు పర్యటించారు. హంపా గ్రామంలో రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్ణయం వల్ల క్రయ విక్రయాలు ఆగిపోయాయన్నారు. హంపా, బొమ్మనపల్లి, కొత్తపల్లి మూడు గ్రామాల రైతులు పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు శివన్న, రంగస్వామి, సర్వేయర్లు, చంద్రకళ, బాలకృష్ణ, సునీల్ ఉన్నారు.

అండర్-17 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి హరిజన బొంబాయి హరి అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లికార్జున తెలిపారు. సోమవారం విద్యార్థిని అభినందించారు. ఇటీవల జిల్లా పోటీల్లో ప్రతిభ చూపి, రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 24నుంచి గుంటూరులో రాష్ట్ర పోటీలో పాల్గొంటాడని తెలిపారు. పీడీలు నరసయ్య, మూజాహిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రైతులకు విశ్రాంతి భవనం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు సేదదీరేందుకు రైతు విశ్రాంతి భవనాన్ని మార్కెట్ కమిటీ అధికారులు సిద్ధం చేశారు. భవనం శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్లుగా మూతపడింది. ఇటీవల సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మార్కెట్ యార్డ్‌లో పర్యటించి, రైతులకు మరో భవనం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించా రు. కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి ఖాళీగా ఉన్న క్యాంటీన్ భవనాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు మధ్యాహ్నం వేళ, రాత్రి వేళల్లో కూడా ఇక్కడే ఉండొచ్చని తెలిపారు.


విశ్రాంతి తీసుకునేందుకు సిద్ధం చేసిన మంచాలు

ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు

ఆదోని టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని, ఆ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ తన పనితీరుపై సంతృప్తి చెందిన పార్టీ అధిష్ఠానం రెండోసారి తనను పార్టీ ఇన్‌చార్జిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీని వీడిన నాయకులు, కార్యకర్తలు తిరిగి కాంగ్రెస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గత వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలను గమనించి ప్రజలు రాష్ట్ర అభివృద్ధి ఒక్క కాంగ్రెస్ పాలనతోనే సాధ్యమవుతుందన్న నమ్మకంతో ఉన్నారన్నారు. పార్టీ బలోపేతాని అందరినీ కలుపుకుని పనిచేస్తానని రమేష్ అన్నారు.

ప్రజాపోరు గోడపత్రికలు విడుదల

వెల్దుర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్ ప్రజాపోరు గోడపత్రికలను, కరపత్రాలను విడుదల చేశారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం ప్రజాపోరు నిర్వహిస్తోందన్నారు. 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాజు, రాముడు, చిన్నయేసు, పెద్దన్న, వెంకటరాముడు, శ్రీను, మాదన్న, మల్లి, మహేష్ కృష్ణ పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యామంత్రి, స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం మల్లికార్జున, ఫయాజుద్దీన్ రవి, నరసయ్య, నాగరాజు, ఖలీల్, నిరంజన్, జుబేర్ గిరిబాబు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనం అభినందనీయం



వడ్డిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో స్వర్ణలత

పత్తికొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ కోసం నెలనెలా ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు భోజనం పెట్టడం అభినందనీయమని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వర్ణలత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆమె భోజనాన్ని వడ్డించారు. వైద్యాధికారి కల్పన ఉన్నారు.

రీసర్వే చేసి భూ సమస్యలను పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆదోని తహసీల్దార్ శివరాముడు



ఆదోని రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే చేసి, రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ శివరాముడు అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?

జవాబ: రీసర్వేతో విస్తీర్ణంలో తేడా ఇతరత్రా భూ సమస్యలు వస్తున్నాయి. వీటిని రీసర్వే చేయించి పరిష్కరిస్తాం.

ప్రశ్న: పైసలిస్తేగాని ఫైళ్లు కదపరని రెవెన్యూ అధికారులపై ముద్ర ఉంది ఇది నిజమేనా?

జవాబు: ఇది కేవలం అపోహ మాత్రమే. రైతులు, ప్రజలు వీటిని విడనాడాలి. అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తప్పవు.

ప్రశ్న: అక్రమ లే అవుట్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మున్సిపల్ అధికారులు, సర్వేయర్లు, వీఆర్వోలతో విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏవిధమైన ప్రణాళిక చేపట్టారు ?

జవాబు: ప్రభుత్వ స్థలాలు, భూములు గుర్తించి, ఆ స్థలాల్లో రెవెన్యూ బోర్డులను ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: రేషన్ పక్కదారి పట్టడంపై ఎలా చర్యలు తీసుకుంటారు?

జవాబు: రేషన్ పక్కదారి పట్టకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుం టాం. రేషన్ అక్రమ వ్యాపారులపై దాడులు నిర్వహించి చట్టం ముందు నిలపెడతాం.

ప్రశ్న: త్రీమెన్ కమిటీ విఫలమై విద్యార్థులకు భోజనం సరిగా అందడం లేదని ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యతో గణేకల్లు, ఆరేకల్లు, దిబ్బనకల్లులో విద్యార్థులకు భోజనం అందని మాట వాస్తవమే. సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలున్నాయి.?

జవాబు: వీర్వోలు అందుబాటులో ఉండాలి. ఫిర్యాదులు వేస్తే చర్యలు తప్పవు

ప్రశ్న: కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారు?

జవాబు: ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాక కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తాం.

అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

నందవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు లేక, పెట్టిన పెట్టుబడులు రాక ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రూ. 20వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు సబ్సిడీ విత్తనాలను ఇచ్చి ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శాంతన్న, నబి, బండేసాబ్, దేవరాజ్, ముని, తిప్పన్న, విజయకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: పంటలను సాగు చేసిన రైతులకు కూటమి ప్రభుత్వం వెంటనే రూ.20వేల పెట్టుబడి సహాయం అందజేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీ.టీ చినన్న, తాలుకా అధ్యక్షుడు మాలిక్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాము, శ్రీరాములు, నరసింహులు, మల్లికార్జునగౌడు, ఖాజా, అంబన్న, శ్రీనివాస, గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

కౌతాళం, నవంబరు, 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో సుబ్బరాజు హాజరై మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు మౌలానా జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు వివిధ నాయకుల వేషధారణతో భారీ జాతీయజెండాతో గ్రామంలోని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా, ఆర్గనైజరు సయ్యద్ మైనొద్దీన్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, ఈరన్న, భీమేష్, శిరీష పాల్గొన్నారు.

పశుగ్రాసానికి పెరిగిన డిమాండ్

● ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న వరి గడ్డి
● ట్రాక్టర్ గ్రాసం రూ.18 వేలు



ట్రాక్టర్లపై వరి గడ్డిని తరలిస్తున్న రైతులు

మంత్రాలయం/గోనెగండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పశు గ్రాసం ధర చుక్కలు చూపతోంది. ఆదోని డివిజన్‌లో గ్రాసం వచ్చే పంటలు ఎక్కువగా సాగుచేయకపోవడం, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రాసం దెబ్బతినడం వల్ల కొరత ఏర్పడింది. మంత్రాలయం, గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా వర్షాలు కురియడం, చేతికి అందిన గ్రాసం నల్లగా మారిపోవడం దీనికి తోడు ఈ మండలాలలో పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దాంతో స్థానికంగా కొరత ఏర్పడింది. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి 18 వేల వరకు పలుకుతుంది. దాంతో కొంతమంది రైతులు గ్రాసం కొనలేక మూగజీవాలను కబేళాలాకు అమ్మేసుకుంటున్నారు. స్థానికంగా పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండడంతో పక్కనే ఉన్న కర్ణాటకకు వెళ్లి పంట కోయక ముందుగానే అడ్వాన్సులు చెల్లించి గ్రాసాన్ని దక్కించుకుంటున్నారు. అలాగే వరి, వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసిన చోట నుంచి గ్రాసం దిగుబడిచేసుకునేందుకు పశుయజమానులు సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా పశుగ్రాసం అందించి ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

గర్భిణులకు స్కానింగ్ తిప్పలు

ఎమ్మిగనూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు ప్రతి సోమవారం నిర్వహించే స్కానింగ్ తిప్పలు తప్పడం లేదు. ఎమ్మిగనూరు చుట్టుముట్టు పల్లెల నుంచే గాక మంత్రాలయం, నందవరం, గోనెగండ్ల మండలాల నుంచి సైతం గర్భిణులు నిత్యం ఈ వైద్యశాలకు స్కానింగ్ కోసం వస్తుంటారు. అయితే గర్భిణులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సిన వైద్యశాల సిబ్బంది మాత్రం అవేమి తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సోమవారం ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన స్కానింగ్‌కు ఆయా గ్రామాల నుంచి దాదాపు 593 మంది గర్భిణులు వచ్చారు. అయితే వారికి సరిపడ సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. కేవలం ఒక సేమియానాను మాత్రమే కట్టి కొన్ని కుర్చీలను వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో అధిక సంఖ్యలో స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణులు ఆస్పత్రిలోని ప్రధాన కార్యాలయం ముందు నేలపైనే కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కొంతమంది చెట్లకింద కూర్చోవడం కనిపించింది. అంతేగాక గంటలు తరబడి లైన్‌లో నిల్చోలేక గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గర్భిణులు తాగేందుకు కూడా మంచినీరు కూడా కరువయ్యాయి. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధాను వివరణ కోరగా భారీ స్థాయిలో గర్భిణులు వస్తారని ఊహించలేదన్నారు. మరోసారి స్కానింగ్ సమయంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామన్నారు. అధిక సంఖ్యలో గర్భిణులు ఒకే రోజు రావడంతోనే కొంత ఇబ్బందులకు గురయ్యారన్నారు.



స్కానింగ్ కోసం ఎదురు చూస్తూ నేలపై కూర్చున్న గర్భిణులు

నేడు ఏకాదశి పూజలకు విరామం

మంత్రాలయం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులిస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీమఠం అధికారులు కల్పించనున్నారు.

రూ.5 లక్షల విరాళం

మంత్రాలయం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన నారాయణ స్వామి అనే భక్తుడు రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి సోమవారం తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేష వస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరిండెంటెంట్ అనంత పురాణిక్, దత్తు స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కోసిగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో చాపమ్మవ్వ దేవి ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు భూమి పూజ చేశారు. త్వరలోనే చాపమ్మవ్వ దేవాలయ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దాతల విరాళాలతో గ్రామస్థుల సహకారంతో చాపమ్మవ్వ దేవి ఆలయం నిర్మిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు గ్రామ పెద్దలు, యువకులు ఉన్నారు.

'నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి'

నందవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని బేగరులు సంఘం రాష్ట్ర నాయకుడు ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం నందవరం ఎంపీడీవో కార్యాలయం ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. నరసింహులు, అంథోని పాల్గొన్నారు.

'కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

నందవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నందవరం మండలం మాచాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కిష్టప్ప కోరారు. సోమవారం ఎంపీడీవో పుల్లయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిష్టప్ప మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. తమకు తెలియకుండా గ్రామంలో పైపులైన్ పనులు, కంప తొలగింపు పనులు సొంతగా తీర్మానాలు రాయడం లాంటి పనులు చేసి అవినీతికి పాల్పడుతున్నాడని అన్నారు.

బాలిక అదృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బాలిక ఆదివారం రాత్రి 9.30గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోసిగిలో మార్మోగిన శివ నామస్మరణ



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కోసిగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండ సోమవారం పురస్కరించుకుని శివాలయాలు శివనామస్మరణంతో భక్తులతో మార్మోగాయి. ఉదయం నుంచే మండలం కేంద్రమైన కోసిగితో పాటు అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోసిగిలోని శ్రీభక్త మార్కెండేయ స్వామి దేవాలయంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో భక్తులు, మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుడు ఆకాశ దీపాన్ని వెలిగించి పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు శివాలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు.

అధిక సాంద్రత పద్ధతిలో పంటలు సాగు చేయాలి

పెద్దకడబూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటను సాగు చేయాలని కేవీకే సమన్వయ కర్త రాఘవేంద్ర, సీఐసీఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వరలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో కృషివిజ్ఞాన కేంద్రం బనవాసి, కేంద్ర పత్తి పరిశోధన స్థానం నాగపూర్ ఆధ్వర్యంలో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడం వల్ల సాధారణ సాగు పద్ధతి కంటే రెండు క్వింటాళ్లు అధిక దిగుబడి గ్రామానికి చెందిన రైతులు నాగేంద్ర, నాగిరెడ్డి సాధించారన్నారు. ఏవో వరప్రసాద్, సుగన్య, విష్ణువర్ధన్ రెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు అందరూ కలసి కట్టుగా ఉంటూ తమ జీవనాన్ని కొనసాగించాలని గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కుర్ణి ఫంక్షన్ హాల్‌లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశం తాపి కార్మికుల సంఘం అధ్యక్షుడు వడ్డే తాయప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే సంఘం గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ తాపి కార్మికుల, వడ్డేరులు అందరూ కలసి ఐక్యంగా ఉంటూ మన హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్లానర్ జగదీష్, ఎల్లప్ప, ఇంజనీర్ మాచాని వెంకటేష్, సెంట్రింగ్ సంఘం అధ్యక్షుడు బి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

భారత రైతు కూలీ సంఘం ఏర్పాటు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని పెసలదిన్నె గ్రామంలో సోమవారం భారత రైతు కూలీ సంఘాన్ని ఏర్పాటు చేశారు. భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యోసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు అవుతున్నా ప్రజా సమస్యలపై స్పందించడంలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ముఖ్యంగా రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో కేశన్న, నరసింహులు, పీర్‌బాషా, రామాంజనేయులు, మా బాషా పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కౌతాళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి సోమవారం దాత రూ.లక్ష నగదును విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు తెలిపారు. కోడుమూరుకు చెందిన సరిత, శ్రీనివాసులు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి దంపతులు రూ.1,00,116ల నగదును సూపరిటెండెంట్ మల్లికార్జున స్వామికు అందజేసినట్లు తెలిపారు. దాతకు ఆలయ అధికారులు స్వామి వారి శేషావస్త్రములను, ఫలపుష్పలను అందజేశారు.

'హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి'

కోసిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2025 జనవరి 5న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ముఖ్య వక్త రఘునాథ్ అన్నారు. సోమవారం కోసిగిలోని సిద్ధారుడ శాంత ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, హిందూ దేవాలయాల అర్చకులు, ధర్మకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం హైందవ శంఖారావం కరపత్రాలను విడుదల చేశారు. హైందవ శంఖారావం సమావేశం విజయవంతం కోసం మంత్రాలయం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నామన్నారు. సభ్యులుగా శ్రీరాములు, రాజు, రామాంజనేయులు, వెంకటేశ్, సురేంద్ర, సిద్ధారెడ్డి తదితరులను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, హిందువులు ముకుంద నర్సారెడ్డి, వెంకటేశ్, రాజు, రామాంజనేయులు, శ్రీరామ్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దశాబ్ద కాలంగా ప్రైవేట్‌గా నవోదయ కోచింగ్ నిర్వహిస్తున్న విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్‌ను సీజ్ చేసి నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకొని గ్రామీణ పేద విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు.

విద్యా పరిరక్షణ కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న

గోనెగండ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. సోమవారం గోనెగండ్లలో ఏఐఎస్ఎఫ్ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వంపై పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా దావుద్, ఉపాధ్యక్షుడిగా భరత్, విజయ్, హరిబాబు, సహాయ కార్యదర్శులుగా ముషారఫ్, హనీఫ్, రాకేష్, కోశాధికారిగా వినోద్‌కుమార్, సభ్యులను ఎన్నుకున్నారు.

సోలార్ లైట్ల దొంగ అరెస్టు

రూ.2.40 లక్షల విలువ చేసే సోలార్ లైట్లు స్వాధీనం

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటేకల్లు గ్రామ సమీపంలోని మూడు నెలల క్రితం చోరీకి గురైన ఎనిమిది సోలార్ లైట్లు దొంగతనం చేసిన దొంగను అరెస్టు చేసినట్లు సీఐ విక్రమ్‌సింహ తెలిపారు. సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో దొంగను, స్వాధీనం చేసుకున్న సోలార్ లైట్లను మీడియా ముందు చూపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కడివెళ్ల గ్రామానికి చెందిన బోయ హనుమంతు, అలియాస్ దొడ్డి హనుమంతు మూడు నెలల క్రితం కోటేకల్లు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రూ.2.40 లక్షలు విలువ చేసే సోలార్‌లైట్లు చోరీకి గురయ్యారు. అప్పట్లో ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన కడివెళ్ల గ్రామానికి చెందిన బోయ హనుమంతు, అలియాస్ దొడ్డి హనుమంతును అరెస్టు చేసి దొంగ నుంచి సోలార్ లైట్లను స్వాధీనం చేసుకున్నారు.

సీఐ సుదర్శన్ రెడ్డి బదిలీని ఆపాలి



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు టౌన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ సీఐ సుదర్శన్ రెడ్డి బదిలీని నిలిపివేయాలని విద్యార్థినులు, ప్రజా సంఘాలు కోరారు. సీఐల బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరు అర్బన్‌లో సీఐగా పనిచేస్తున్న సుదర్శన్ రెడ్డిని మరోచోటికి బదిలీ చేస్తున్నారని తెలసుకున్న ప్రజా సంఘాలు,విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున సోమవారం ఆందోళన చేపట్టారు. ముందుగా పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి అక్కడి నుండి శివ సర్కిల్ వరకు విద్యార్థినులు మానవ హారంగా ఏర్పడ్డారు. శివ సర్కిల్‌లో కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గణేష్, యోసేపు, ఆనీఫ్, యాపిలయ్య, రంగయ్య, రంగస్వామి, అజిత్‌కుమార్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెద్దకడబూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోకుండా కక్షలు వీడి ప్రశాంతంగా జీవించాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. సోమవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలోని సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, లేకపోతే జీవితాలను నాశనం చేసుకోని కేసులు నమోదు అవుతాయన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోని రోడ్డు ప్రమాదాలు నివారించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల వల్ల మోసపోయిన వారు వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

మంత్రాలయం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధింపులకు గురి చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన పుష్పావతికి జయరాజు అనే వ్యక్తితో 20 సంవత్సరాల క్రితం వివాహం అయింది. నాటి నుంచి నిత్యం మద్యంతాగి వచ్చి పుష్పావతిని కొడుతూ, నానా దుర్భాషలాడేవాడు. దానికి ఆడపడుచు సుజాత, ఆమె భర్త జక్కరయ్య మద్దతు తెలుపుతున్నారని బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో మహిళ ఫిర్యాదు మేరకు భర్తతో పాటు ముగ్గురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.